సాక్షి
పల్నాడు
మంగళవారం । 6 । మే । 2025



విష్ణుమూర్తిగా స్వామి దర్శనం

పొన్నూరు: శ్రీసుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విష్ణు మూర్తి అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.



పుస్తక పఠనం అలవరుచుకోవాలి

ప్రత్తిపాడు: పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని గ్రంథాలయాధికారి బి.అరుణ అన్నారు. ప్రత్తిపాడు లైబ్రరీలో సోమవారం చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు.


మద్దిరాలమ్మ గ్రామోత్సవం



నగరం: ఏలేటిపాలెం గ్రామదేవత మద్దిరాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను ఏలేటిపాలెం నుంచి భట్టువారిపాలెం గ్రామానికి తరలించారు.

న్యూస్‌రీల్

ఘనంగా బగళాముఖి జయంతి పూజలు



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారి జయంతి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జయంతి పూజలలో భాగంగా అమ్మవారి ఆలయంలో 108 కళాశాలలో మహిళలు సుగంధ ద్రవ్యాలు తీసుకువచ్చి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి నిజరూప బగళాముఖి అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన స్వర్ణవర్ణపు సింహం విగ్రహాలను అమ్మవారి విగ్రహం ముందు ఇరువైపులా ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జయంతి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీక్షీరభావన్నారాయణస్వామి




బాపట్ల : శ్రీక్షీరభావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు జరిగింది. నవాహ్నిక దీక్ష పూర్వక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఊరేగింపు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలు పురవీధుల్లో ఊరేగింపు చేయటంతో భక్తులు టెంకాయలుకొట్టి పూజలు చేశారు.

జీజీహెచ్ సిబ్బందికి మెమోలు

అడిషనల్ డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు జీజీహెచ్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత గతంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆషా సజనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అనంతరం ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌లో తనిఖీలు చేసి, ఆపరేషన్ థియేటర్‌లో సక్రమంగా ఓటీ డ్రస్సులు ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత వైద్య సిబ్బంది, వైద్యులకు మెమోలు జారీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను ఆదేశించారు. మార్చురీ విభాగంలో తనిఖీలు చేశారు. లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మనోజ్ మార్చురీ విభాగంలో విధులు నిర్వహిస్తుండటంతో అతనిని అక్కడి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్య విద్యార్థులకు మార్చురీ విభాగంలో క్లినికల్ తరగతులు నిర్వహించేందుకు వసతులు పరిశీలించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగంలో వైద్యులు, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, నర్సింగ్ రిజిస్ట్రారు సుశీల తదితరులు ఉన్నారు.

చైల్డ్ హోమ్‌కు పసికందు



పొన్నూరు: మండలంలోని పచ్చల తాడిపర్రు గ్రామంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన పసికందుకు నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడిన నేపథ్యంలో సోమవారం మగ శిశువును వైద్యశాల డాక్టర్ ఫిరోజ్ ఖాన్ గుంటూరు చైల్డ్ హోమ్ నిర్వాహకులకు సీడీపీఓ వెంకట రమణ ఆధ్వర్యంలో అందజేశారు.

తిరుపతమ్మ ఆలయానికి ట్రాక్టర్ ట్రక్కు బహూకరణ

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సోమవారం గ్రామానికే చెందిన కర్ల భాస్కరరావు, పద్మావతి దంపతుల కుమారులు కర్ల రామకృష్ణారావు, వసుంధర దంపతులు, కర్ల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు రూ.2.50లక్షల విలువైన ట్రాక్టర్ ట్రక్కును బహూకరించారు. గతంలో వీరు ఆలయానికి రూ.10 లక్షల విలువైన ట్రాక్టర్‌ను అందించారని అధికారులు తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఛ్ఛ.. లాభం లేదు!

జిల్లాలో జనసేన నేతల అంతర్మథనం

అధికారం వస్తే అందరూ సమానమన్నారు.. కానీ ఆ అందరికంటే వెనక్కి నెట్టారు. పల్లకి మోస్తే పదవులు ఇస్తామన్నారు. పదవులన్నీ వాళ్లే తీసుకొని పాలెగాళ్లను చేశారు. అందరి జెండాలు భుజాన వేసుకుంటే వెన్ను తట్టి నిలుస్తామన్నారు. చివరకు మీరే గుదిబండ అయ్యారంటూ భుజం పట్టి పక్కకి నెట్టారు. అధికారంలో ఉన్నామో, ప్రతిపక్షంలో కూర్చున్నామో అర్థంగాక, ఎక్కడా గౌరవం దక్కక పల్నాడు జిల్లా జనసేన నేతలు గుండె మంటతో రగిలిపోతున్నారు. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో ఉన్నారు.

- నామినేటెడ్ పదవుల్లో జిల్లా జనసేన నేతలకు ఒక్కటీ దక్కని వైనం
- పదవులన్నీ గోదావరి జిల్లా నేతలకే ఇస్తే మా పరిస్థితి ఏంటంటూ ఆవేదన
- అధిష్టానం తమ గురించి పట్టించుకోవడం లేదని అసంతృప్తి
- నామినేషన్ ఉపసంహరిస్తే నామినేటెడ్ పదవి ఇస్తామని ఎన్నికల సమయంలో సత్తెనపల్లి నేత బొర్రా అప్పారావుకు హామీ
- నరసరావుపేట ఎమ్మెల్యే సీటు దక్కనందుకు జిలానికీ పదవి ఆఫర్
- ఏడాది కావొస్తున్నా దక్కని పదవులు
- రెవెన్యూ, పోలీసు కార్యాలయాల్లోనూ మాట నెగ్గడం లేదని గగ్గోలు
- బెల్టుషాపులు, రేషన్, ఇసుక దందాల్లో వాటాలు కావాలంటూ డిమాండ్

సాక్షి, నరసరావుపేట: అధికార కూటమిలో ఉన్నామన్న మాట తప్ప తమకు పావలా ఉపయోగం లేదన్న నిరాశలో పల్నాడు జిల్లా జనసేన నేతలున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా జిల్లాలో ఒక్కరికంటే ఒక్కరికి కూడా నామినేటెడ్ పదవి దక్కలేదన్న నిరాశ, నిస్పృహలో ఉన్నారు. పోనీ పదవులు లేకపోయినా పెత్తనమన్నా దక్కిందా అంటే అది కూడా లేదని వారు వాపోతున్నారట. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలే జిల్లాలో అధికార పెత్తనం మొత్తం చెలాయిస్తున్నారు. ప్రజాధనాన్ని దోపిడిలోనూ వారిదే పై చేయి. కూటమి అధికారంలోకి రావడానికి ఎంతో కీలకమైన మాకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న భావన జనసేన నేతలు, కార్యకర్తలలో ఉంది. దీనిపై ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు జనసేన నేతలు ఆ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. అయినా ఉపయోగం లేదన్న భావన వారిలో ఉంది. అధిష్టానం కేవలం గోదావరి జిల్లాల నేతలకు పదవులు, పెత్తనం సాధించే పనిలో ఉందని, మాకు గురించి ఆలోచించే తీరిక కూడా లేదంటున్నారు.

హామీలు.. నీటిపై రాతలు!

సార్వత్రిక ఎన్నికల ముందు జనసేన జిల్లా నేతలతో పనిచేయించుకోవడానికి జనసేన, టీడీపీ ముఖ్యనేతలు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. సత్తెనపల్లి అసెంబ్లీ టికెట్ ఆశించిన బొర్రా వెంకట అప్పారావు ఎన్నికల ముందు నుంచే నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చుపెట్టి పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించారు. పొత్తులో భాగంగా జిల్లాలో ఒక్క సీటు అయినా జనసేనకు కేటాయిస్తారని అది సత్తెనపల్లే ఉంటుందని ఆయన వర్గం బాగా ప్రచారం చేసింది. తీరా చూస్తే కూటమి తరఫున ఎమ్మెల్యే సీటు కన్నా లక్ష్మీనారాయణకు కేటాయించారు. దీంతో బొర్రా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. వెంటనే రంగంలోకి దిగిన జనసేన, టీడీపీ ముఖ్యనేతలు అప్పారావును బుజ్జగించి నామినేషన్ ఉపసంహరించుకొనేలా చేశారు. అధికారంలోకి రాగానే మంచి నామినేటెడ్ పదవి అప్పగించి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఏడాదైనా అతిగతీ లేదని ఆయన వర్గం తీవ్ర నిరాశలో ఉంది.

■ అదే విధంగా నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ జనసేన జెండాతో 2019 ఎన్నికల్లో పోటీ చేసి భారీగా ఖర్చు పెట్టి పార్టీ ఉనికి కోసం పోరాడాడు. తన సొంత గ్రామం పమిడిపాడులో ఆ పార్టీ తరఫున అభ్యర్థిని నెలబెట్టి సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు. 2024 ఎన్నికల వరకు కూడా నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యక్రమాలను అన్నీ తానై నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే టికెట్ నీదేనంటూ చివరి వరకు అధిష్టానం చెబుతూ వచ్చి, తీరా టీడీపీ అభ్యర్థికే కూటమి తరఫున బీఫాం ఇచ్చారు. ఆసమయంలో జిలానీ అలగడంతో అధికారంలోకి వచ్చాక మైనార్టీ కోటాలో పదవితోపాటు మంచి గుర్తింపు ఉంటుందని అధిష్టానం హామీఇచ్చింది. తీరా చూస్తే ఏడాదిగా పదవి రాకపోగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏమాత్రం గుర్తింపు దక్కడం లేదు.

■ వినుకొండ జనసేన నేత నిస్సంక శ్రీనివాసరావుది దాదాపుగా ఇదే పరిస్థితి. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనను పట్టించుకోలేదన్న ఆవేదన ఆయనలో ఉందట. జనసేనకు గట్టి పట్టున్న సామాజిక వర్గం అధికంగా ఉండే పెదకూరపాడు, గురజాల, చిలకలూరిపేటలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడి జనసేన నేతలకు ప్రభుత్వ కార్యాలయాలలో ఏమాత్రం గౌరవం దక్కడం లేదన్న భావన వారిలో ఉంది.



పదవి రాదు.. పెత్తనమూ లేదు



ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జనసేన నేతలకు ప్రాధాన్యం ఇవ్వకపోగా, కనీసం ఏదైనా కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కి వెళ్తే కనీస మర్యాద ఇవ్వడం లేదంటూ నేతలు ఆవేదన చెందుతున్నారు. భూసమస్యల నిమిత్తం రెవెన్యూ కార్యాలయాలకు వెళితే టీడీపీ మండల స్థాయి నేతల సిఫార్సు కావాలని అధికారులు చెబుతుండటం జనసేన నేతలకు మింగుడు పడటం లేదు. కూటమి అధికారంలో వచ్చిన తరువాత రేషన్ బియ్యం అక్రమ రవాణా, బెల్టుషాపులు, లిక్కర్ టెండర్లు, మైనింగ్ వంటి ఆదాయం వచ్చే ప్రతి విషయంలో టీడీపీ నాయకులు ముందు వరుసలో ఉంటూ జేబులు నింపుకొంటున్నారు. తమకు మాత్రం రిక్తహస్తమే దక్కుతోందని ఆవేదనలో ఉన్నారు. తమ దుస్థితిపై పార్టీలో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నామని వారు చెప్పుకొస్తున్నారు. తమ అధినేత పవన్ కల్యాణ్ స్వప్రయోజనాలు తప్ప క్యాడర్ గురించి, పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదని కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

పోస్టర్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



నరసరావుపేట: బాలికలు, యువతుల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. కౌమార బాలికల సాధికారిత లక్ష్యంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరి వికాసం వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. యుక్తవయస్సు బాలికలకు ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఈ ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్‌ను రూపొందించడం జరిగిందన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ నియంత్రణలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేయాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలను ఈ-సాధన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ వేసవి కార్యక్రమం మొత్తం విజ్ఞానవంతంగా, ఆనందోత్సాహంగా ఉండాలని, దీనిలో కిశోర బాలికలు పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఇది 138.3868 టీఎంసీలకు సమానం.

కక్ష సాధింపే కూటమి ధ్యేయం

- బుచ్చిబాపనపాలెంలో తాగునీరు, పారిశుధ్య చర్యలు నిలుపుదలపై మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆగ్రహం
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు



గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని మరిచి అధికారులను అడ్డంపెట్టుకొని ప్రత్యర్థులపై కక్షసాధింపే ధ్యేయంగా పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తన స్వగ్రామమైన బుచ్చిబాపనపాలెంలో కక్షసాధింపు చర్యల్లో భాగంగా గ్రామస్తులకు తాగునీరు ఆపేసి, పారిశుధ్య పనులను నిలిపివేసిన సెక్రటరీ ఏకపక్ష వ్యవహార శైలిని ఖండిస్తూ గ్రామానికి చెందిన సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడారు. గ్రామ పరిధిలో పంచాయతీ సెక్రటరీగా ఉన్న వ్యక్తి అప్పటికే అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను తొలగించి ఇతర గ్రామాల నుంచి తన సొంత మనుషులను నియమించుకున్నాడన్నారు. వారు పారిశుద్ధ్యం జోలికి పోవడం లేదన్నారు. వీధిలైట్లు పనిచేయక రాత్రిళ్లు ఇబ్బందిపడుతున్నామంటూ గ్రామస్తులు చెప్పినా బాగుచేయడం లేదన్నారు. దీనికి కారణం బుచ్చిబాపనపాలెం తన సొంత గ్రామం కావడమేనన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్తులు అందరూ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేశారన్న కక్షతోనే ఈ విధంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు.

నాలుగు నెలలుగా నీటి సరఫరా లేదు

ఈ సెక్రటరీ గతంలో యలమంద, సాతులూరు లాంటి గ్రామాల్లో పనిచేశాడని, ఇతనిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇటువంటి వ్యక్తిని కావాలని తమ గ్రామానికి వేసి ఇబ్బందిపాలు చేస్తున్నారన్నారు. గ్రామానికి నీరందించేందుకు ఆరెకరాల చెరువుతో పాటు ట్యాంకు, పైపులైను ఉందన్నారు. బటన్ నొక్కితే తాగునీరు సరఫరా అయ్యే పరిస్థితులు ఉన్నా కూడా నాలుగు నెలల నుంచి సరఫరా చేయడందన్నారు. దీనిపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు అందరూ సెక్రటరీని కలిస్తే తాను పెట్టమన్నచోట సంతకాలు పెట్టాలనే షరతు విధించాడన్నారు. తన సొంత బిల్లులతో పంచాయతీ సొమ్ము డ్రా చేస్తున్నాడన్నారు. గ్రామస్తుల తరఫున కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని కలవటం జరిగిందన్నారు. సమగ్ర విచారణ చేయమని డీపీఓను ఆదేశించారన్నారు. వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు తమ గ్రామంలో పారిశుధ్య పనులు చేయాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలోనే కార్మికులు ఉన్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన అంగీకరించారన్నారు. ఎంపీటీసీ తిరుపతయ్య గ్రామంలో జరుగుతున్న పరిస్థితిని వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మాజీ కన్వీనర్ పచ్చవ రవీంద్ర, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, షేక్ కరిముల్లా, గంటెనపాటి గాబ్రియేలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్ఎస్‌లో 291 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 291 అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ గనోరే సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ ఏకా మురళి, ఆర్డీఓ కె.మధులత అర్జీలను స్వీకరించారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

ఒత్తిళ్ల మేరకు పింఛన్లు ఆపేశారు



గ్రామానికి చెందిన ఐదుగురు దివ్యాంగులు, ఇద్దరు డప్పు కళాకారులతో పాటు తొమ్మిది మందికి పింఛన్లు ఆపేశారు. అదేమని అధికారులను అడిగితే ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. చివరకు ఎంపీడీఓ రాజకీయ ఒత్తిడి మేరకు పింఛన్ ఇవ్వలేకపోయానని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని పింఛన్ ఇప్పించండి.

–తిరువీధుల ఆదిశేషు, అలెగ్జాండర్, తదితరులు పిచికలపాలెం, శావల్యాపురం మండలం

కుడికాలువకు మరమ్మతులు చేయాలి



నాగార్జునసాగర్ కుడి కాలువ మరమ్మతులకు బడ్జెట్ కేటాయించి వర్షాలు పడక ముందే మరమ్మతులు పూర్తిచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖపై సరైన దృష్టిపెట్టకపోవడం వలన పనులు సరిగా జరగటంలేదు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి విఠంరాజుపల్లి మైనర్ ఇరిగేషన్ కాలువ రిపేర్ చేయాలని రైతులు అనేకసార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేదు.

–వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ప్రజాసంఘాల నాయకులు

జీఓ నెంబర్ 30 అమలు చేయాలి



గత 20ఏళ్లకు పైబడి నివాసం ఉంటున్న బాపనయ్యనగర్ వాసుల గృహాలకు పట్టాలు ఇవ్వాలి. సెంటు స్థలం లేని పేద, బడుగు,బలహీన వర్గాల ప్రజలు అధికంగా అక్కడ ఉన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసుకొని గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఇంటి పన్నులు సైతం కడుతున్నారు. ప్రభుత్వం జీఓ నెంబర్ 30 తీసుకువచ్చి 150 కుటుంబాల ఆక్రమితదారులకు హక్కులు కల్పించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గోదా జాన్‌పాల్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, బాపనయ్యనగర్ వాసులు

ఉత్తమ ప్రదర్శనగా '27వ మైలురాయి'



ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంటున్న '27వ మైలురాయి' నాటిక బృందం

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీల్లో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంది. ఇదే నాటికలో వైదేహి పాత్రలో నటించిన ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటి సురభి ప్రభావతి ఉత్తమ నటిగా, రాజన్న పాత్రధారి పవన్‌కుమార్ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా, నాటిక రచయిత పీటీ మాధవ్ ఉత్తమ రచయిత బహుమతులను అందుకున్నారు. మూడురోజులపాటు జరిగిన నాటికల పోటీల్లో విజేతలకు చివరి రోజైన ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, విశాఖపట్నం వారు ప్రదర్శించి 'అ సత్యం' నాటిక ఎంపికైంది. ఇదే నాటికకు మరో నాలుగు బహుమతులు దక్కటం విశేషం. రఘుపతి పాత్రధారి వై.అనిల్‌కుమార్ ఉత్తమ ప్రతినాయకుడు, నాటిక దర్శకుడు పి.బాలాజీనాయక్‌కు, సంగీతాన్ని అందించిన పి.లీలామోహన్‌కు ఉత్తమ సంగీతం, ఉత్తమ లైటింగ్‌కు థామస్ బహుమతులను అందుకున్నారు. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటిక ఎంపికైంది. ఇదే నాటికలో నటించిన గోవాడ వెంకట్ ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్నారు. 'మతమా మానవత్వమా'నాటికలో నటించిన కె.రాజేశ్వరికి ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతిరాగా, 'మహాప్రస్థానం'లో సింహాద్రి పాత్రధారి బొర్రా నరేష్‌కు ఉత్తమ సహాయనటుడు బహుమతి లభించింది. జి.సురేంద్రబాబుకు ఉత్తమ హాస్యనటుడు, 'బ్రహ్మస్వరూపం'లో నటించిన ఎం.రత్నకుమారికి బెస్ట్ డైలాగ్ ఆర్టిస్ట్ బహుమతులు వచ్చాయి.

వేసవి శిక్షణ కేంద్రాల కోలాహలం

జిల్లాలో 17 క్రీడాంశాల్లో 50 శిక్షణ శిబిరాలు

సత్తెనపల్లి: వేసవి వచ్చిందంటే పిల్లలతో మైదానాలు నిండిపోతాయి. వివిధ రకాల క్రీడలను కోచ్‌లు ఉచితంగా నేర్పిస్తుండడంతో పిల్లలు పెద్ద సంఖ్యలో ఈ వేసవి శిబిరాల్లో చేరుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు మైదానాల్లో శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉదయం, సాయంత్రాలు వేసవి శిబిరాలకు పంపి వారిలో క్రీడానైపుణ్యాలు పెంచుతున్నారు. కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పిల్లలకు ఆటల్లో మెలకువలు నేర్పుతున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 17 క్రీడాంశాల్లో 50 శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోచ్‌లు కోరుతున్నారు.



అమరావతి స్కూల్‌లో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థులు క్రీడాకారులుగా రాణించాలి



జిల్లాలోని విద్యార్థులు మంచి క్రీడాకారులుగా రాణించటానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. క్రీడల్లో మెలకువలను తెలుసుకొని ఆ మేరకు సాధన చేస్తే తప్పకుండా విజేతలుగా నిలుస్తారు. నెల రోజులు పాటు జరిగే వేసవి శిక్షణ శిబిరాలను ఎక్కువమంది వినియోగించుకునేలా క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

–పి.నరసింహారెడ్డి, డీఎస్‌డీఓ, పల్నాడు

క్లుప్తంగా

హిందూ ధర్మం గురించి తెలియజేయాలి



అమర్తలూరు(వేమూరు): సాహిత్య ప్రాజెక్టు హిందూ ధర్మం గురించి ప్రతి ఒక్కరూ తెలియజేయాలని దాస సాహిత్య ప్రాజెక్టు అధ్యక్షులు శ్రీమాన్ గడ్డిపాటి శ్రీనివాసరావు అన్నారు. అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు హిందూ ధర్మ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన గరువుపాలెంలో హనుమాన్ శోభా యాత్ర, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 22వ తేదీన ప్రతి గ్రామంలో దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. హనుమంతును స్ఫూర్తిగా తీసుకొని ధర్మ రక్షణ కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, తమ్మన సాంబశివరావు, రామిశెట్టి నరసింహారావు, దాస సాహిత్య భజన మండల సభ్యులు పాల్గొన్నారు.

బేసిక్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి



రేపల్లె: బేసిక్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి విధానాన్ని అన్ని పాఠశాలలో ఒకే విధంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఏపీటీఎఫ్ దశల వారి ఉద్యమాలకు ప్రణాళిక రచించిందని అన్నారు. సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, 12వ పీఆర్సీని ప్రకటించి పెండింగ్‌లో ఉన్న ఐఆర్, డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రాజారత్నం, వై.ఆంజనేయ ప్రసాద్, తేలప్రోలు శ్రీనివాసరావు, వై. చెన్నకేశవులు, సీహెచ్.శ్రీనివాస్, ఎం.రాంబాబు. పి.లక్ష్మీనారాయణ, కుర్రా కిరణ్, డి మల్లికార్జునరావు, సత్యనారాయణ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

వేదనలు.. నివేదనలు

- పోలీసు పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన అర్జీదారులు
- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

నరసరావుపేట: జర్మనీ పంపిస్తామని రూ.6లక్షలు తీసుకొని మోసం చేశారంటూ చిలకలూరిపేట పట్టణానికి చెందిన షేక్ అన్వర్‌బాషా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఎస్పీ అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 77 ఫిర్యాదులు స్వీకరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

జర్మనీ పంపిస్తామంటూ రూ.6లక్షలు మోసం

ఒకరోజు నాకు బోర్డు టు కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ హరీష్‌సింగ్ వద్ద నుంచి కాల్ వచ్చింది. ఆఫీసుకు వెళ్లి కలవగా నన్ను జర్మనీకి పంపేందుకు రూ.6లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. తొలివిడతగా రూ.2లక్షలు చెల్లించాను. జర్మనీ వర్కింగ్ వీసా స్టాంపింగ్ కోసం మరో రూ.4లక్షలు కావాలంటే ఆన్‌లైన్ ద్వారా వారి అకౌంట్‌కు జమ చేశాను. ఇప్పటికి 14 నెలలు గడుస్తున్నా ఎటువంటి సమాచారం లేదు. ఆఫీసుకు వెళ్లగా ఎత్తివేసినట్లు తెలిసింది. అడ్రస్ కనుక్కొని వెళ్లి అడగ్గా, నెల రోజులు గడువు ఇస్తే మీ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పారు. ఆ తర్వాత నాకు కేసులు ఏమీ కొత్త కాదు, మీరు ప్రాణాలతో కూడా ఉండరని బెదిరిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–షేక్ అన్వర్‌బాషా, సుభానినగర్, చిలకలూరిపేట

పొలంపైకి వస్తున్న నీటిని రాకుండా చేయండి

నాకు, కొంతమంది రైతులకు శంకరాపురం శివారులో సుమారు 20 ఎకరాల్లో పొలాలు ఉన్నాయి. దానికి తూర్పు వైపున ఓ సిమెంట్ ఫ్యాక్టరీ వారు కరెంటు సబ్ స్టేషన్ నిర్మించారు. గతంలో వర్షాకాలంలో పైనుంచి వచ్చే వర్షపు నీరు వారు కట్టిన సబ్‌స్టేషన్ నుంచి ప్రవహించేది. ఆ వర్షపు నీరు రాకుండా సబ్ స్టేషన్‌కు తూర్పు వైపున పెద్ద ప్రహరీ నిర్మాణం చేశారు. దీనివలన ఆ నీరు మొత్తం వ్యవసాయ భూములపై ప్రవహించి పంటలు దెబ్బ తింటున్నాయి. ఆ విషయం వివరించేందుకు సిమెంట్ ఫ్యాక్టరీ ఫీల్డ్ జీఎంను కలిసేందుకు వెళ్లగా మమ్మల్ని దుర్భాషలాడి మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, అంటూ సెక్యూరిటీ గార్డులతో బయటకు గెంటించాడు. వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

–దోర్నాల నాగిరెడ్డి, ఇతర రైతులు, గాదేవారిపల్లె, కారెంపూడి మండలం

బాగున్నావా అంటూ రూ.50వేలు కాజేశాడు

గత నెల 26న నేను కారంపూడి మండలం కాచవరం గ్రామంలో బంధువుల దశ కర్మలకు వెళ్లాను. అక్కడ చీమలదిన్నె అంజి అనే వ్యక్తి నా వద్దకు వచ్చి బాగున్నావా.. నన్ను గుర్తుపట్టావా అని అడిగి చొక్కా బలవంతంగా లాగాడు. లోపలి జేబులో ఉన్న రూ.50వేలు కట్ట కిందపడింది. దానిని అతను తీసుకొని నీకు దిక్కున్న చోట చెప్పుకోమని తిడుతూ ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. అతనికి ఫోన్ చేయగా దుర్భాషలాడుతున్నాడు. ఎటువంటి కారణం లేకుండా కొట్టి డబ్బులు తీసుకున్న అంజయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించండి.

–కాకునూరి శ్రీను, రచ్చమల్లపాడు, వెల్దుర్తి మండలం

భర్త వేధిస్తున్నాడు

నేను, నా భర్త బాలయేసు ప్రేమించుకొని పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాం. అయితే అతడు వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని నన్ను పట్టించుకోకుండా విడాకులు ఇవ్వాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, దొడ్లేరు గ్రామం, క్రోసూరు మండలం

తీసుకున్న డబ్బులు అడిగితే కొట్టారు

నాకున్న ఎకరం భూమిలో మట్టి తోలడానికి గ్రామానికి చెందిన వేమవరపు కొండయ్య, శివలకు రూ.1.70లక్షలు ఇచ్చాను. ఆ డబ్బుల గురించి అనేక మార్లు అడగ్గా అదిగో ఇదిగో వారం, నెల అంటూ గడుపుతూ వస్తున్నారు. గత నెల 6వ తేదీన గట్టిగా నిలదీస్తే నాపై దాడి చేసి, చంపుతామని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించండి.

–కొర్నెపాటి బుల్లెబ్బాయి, కాకాని గ్రామం, నరసరావుపేట మండలం

సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తాం

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి డివిజన్ కేంద్రంలో ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీఓ 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలలనుంచి 3,4,5 తరగతులు వెనక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా నేడు అదనంగా 1,2 తరగతులను కూడా ఉన్నత పాఠశాలలోకి కలపడం మోసం చేయడమేనన్నారు. ప్రపంచ బ్యాంకు ఒత్తిడులకు తలొగ్గి ప్రభుత్వం పాఠశాల వ్యవస్థను విధ్వంసం చేసే పనులు కొనసాగిస్తుందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు 1 నుంచి 5 తరగతులు ప్రాథమిక పాఠశాలలోను, 6 నుంచి 10 లేక 12 తరగతులు ఉన్నత పాఠశాలల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఎస్జీటీలను ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య పెరిగేకొద్దీ ఉపాధ్యాయులను అదనంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అసంబద్ధ నిర్ణయాలు కొనసాగిస్తే ఈ నెల 9న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే 14వ తేదీన విజయవాడలో పెద్దఎత్తున మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, కరువు భత్యం 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన అనంతరం తహసీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. ఏపీటీఎఫ్ నిరసన ప్రదర్శనకు సంఘీభావంగా ఏపీ ఎన్జీఓ సత్తెనపల్లి యూనిట్ సెక్రటరీ అంబేడ్కర్, ట్రెజరీ అసోసియేషన్ నాయకులు ఇబ్రహీం పాల్గొన్నారు. కార్యాక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు, తాలూకా పరిధిలోని వివిధ మండలాల ఏపీటీఎఫ్ నాయకులు ధర్మారావు, హఫీజ్, ఐతమ్‌రాజు, అత్తరున్నీస, తులసి, భావనాఋషి, చంద్రం, పియం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సంఘీభావం తెలియచేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నరసరావుపేట: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌ఓ) ను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గత ఎనిమిది రోజులుగా నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌ఓల దీక్షా శిబిరాన్ని సోమవారం సందర్శించి వారికి వైఎస్సార్ సీపీ తరఫున సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు అనుపమ ద్వారా డిమాండ్ల తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ తరఫున విలేజ్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న సీహెచ్‌ఓలు తమ న్యాయమైన కోరికల సాధన కొరకు సమ్మె చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం తరఫున కనీస స్పందన కూడా లేదని, వీరి న్యాయబద్ధమైన కోరికలు తీర్చమని అడుగుతుంటే, ఈ ప్రభుత్వంలో వినే నాథుడే లేడని అన్నారు. రెండు రోజుల క్రితం వీరి బాధలు చెప్పుకోవడానికి ఆరోగ్యశాఖ మంత్రిని కలిస్తే మీకు ఏం చేయమని, మీకు దిక్కున చోట చెప్పుకోండని సమాధానం చెప్పటం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. వీరందరూ బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తిచేసి సెలక్షన్ ప్యానల్ కమిటీ ద్వారా రిక్రూట్ అయ్యారని, వీరిని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన అందరిని తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు షేక్ కరీముల్లా, సామాజిక విశ్లేషకులు ఈదర గోపీచంద్ పాల్గొన్నారు.

నిందితులకు కొమ్ము కాయటం ఘోరం

- గంటావారిపాలెం ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి
- బాధితులకు రూ.18లక్షలు నష్టపరిహారం చెల్లించాలి
- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసిన దళిత, గిరిజన ఐక్యవేదిక నాయకులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, బాధితులు

నరసరావుపేట: శావల్యాపురం మండలం గంటవారిపాలెంలో కుంభా యోగయ్య షాపులను కూల్చిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి షాపులు కూల్చివేతకు ఉపయోగించిన పొక్లెయిన్‌ను సీజ్ చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలు అనంతరం పల్నాడు జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారుల టీడీపీ అనుకూల చర్యలను నిరసిస్తూ దళిత, గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కృష్ణ మాట్లాడుతూ గ్రామ శివారు ఎరుకలవాడలో గత నెల 19న ఎరుకల కులస్తులైన కుంభా యోగయ్య చికెన్, కిరాణా షాపులను ఆ గ్రామ టీడీపీ నాయకులు వెంకట్రావు, మురళి, మధుసూదనరావు, రామకృష్ణ, వెంకట హరినరసింహారావులు పొక్లెయిన్‌తో కూల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. షాపుల కూల్చివేతను అడ్డుకున్న పులి నాగేశ్వరరావుపై విచక్షణారహితంగా దాడి చేస్తున్న సమయంలో ఆ దాడి దృశ్యాలను సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్న కుంభా సుజాతను కులం పేరుతో మధుసూధనరావు దూషించడమే కాకుండా ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారన్నారు. ఇంతటి దారుణమైన సంఘటన జరిగినా స్థానిక ఎస్ఐ, తహసీల్దార్ మొదలు జిల్లా కలెక్టర్, ఎస్పీ వరకు గ్రామాన్ని సందర్శించి బాధితులకు భరోసా ఇవ్వకపోవటం దారుణమన్నారు. అధికారులు అధికార టీడీపీ కూటమి కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధిపత్య శక్తులనుంచి బాధితులకు రక్షణ కల్పించడంతోపాటు రూ.18 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘటనపై నిజాయితీ కలిగిన డీఎస్పీతో కేసు విచారణ చేయించి దోషులకు శిక్షలు పడేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా ప్రగతిశీల కార్మిక సమాఖ్య కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రసన్న కుమార్, బీసీ సంఘ నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, ఓర్సు శ్రీనివాసరావు, జక్కా బ్రహ్మయ్య, కేవీపీఎస్ నాయకుడు చలంచర్ల అంజి పాల్గొన్నారు.

మహిళా కండక్టర్‌పై దాడి కేసులో జైలుశిక్ష, జరిమానా

మేడికొండూరు: మహిళా కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తికి శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడైన దండు రామనాథరెడ్డి విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ విధులకు అడ్డుపడ్డాడు. శారీరక దాడికి పాల్పడటమే కాకుండా, ఆమె ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డాడు. వివరాలు.. మేడికొండూరు మండలంలో 2021 అక్టోబరు 2న మహిళా బస్సు కండక్టర్ షేక్ మోహిద్‌నిషా బేగంపై రామనాథరెడ్డి దాడి చేసి ఆమెను కొట్టి గాయపరిచాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్షులు, జరిగిన సంఘటనను కోర్టులో వివరించారు. వాదోపవాదనలు విన్న గుంటూరు 5వ జేఎఫ్‌సీఎం కోర్ట్ జడ్జి కోలార్ లత నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపు అల్లంశెట్టి పవన్ కుమార్ వాదనలు వినిపించారు.

ఈపీఓఎస్‌లో ఎరువుల విక్రయాల నమోదు తప్పనిసరి



ఈపీఓఎస్‌ను అందజేస్తున్న కృపాదాస్ తదితరులు

నగరంపాలెం: డీలర్లు విక్రయించిన ఎరువులను ఎప్పటికప్పుడు రైతుల ఆధార్ ద్వారా ఈపీఓఎస్ (అమ్మకం యంత్రాలు)లో నమోదు చేయాలని కమిషనర్ కార్యాలయ సంయుక్త వ్యవసాయ సంచాలకులు వీడీవీ కృపాదాస్ ఆదేశించారు. పరదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ , కోరోమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంయుక్తంగా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని కృషి భవన్‌లో సోమవారం జిల్లాలోని రిటైల్ ఎరువుల డీలర్లకు అమ్మకం యంత్రాలు ఉచితంగా పంపిణీ చేశాయి. కృపాదాస్ మాట్లాడుతూ ఈపీఓఎస్‌లో నమోదు కాకపోతే కేంద్రం నిర్వహించే ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఏపీలో అధిక ఎరువుల నిల్వలు ఉన్నట్లు చూపుతాయని తెలిపారు. తద్వారా రాష్ట్రానికి ఎరువులు సకాలంలో పంపిణీకావని చెప్పారు. రిటైల్ డీలర్లు విధిగా ఈపీఓఎస్‌లో ఎరువుల విక్రయాలు చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీలు రూ.27 వేలు ఖరీదు చేసే 276 అమ్మకం యంత్రాలను రిటైల్ డీలర్లకు ఉచితంగా అందించాయని తెలిపారు. త్వరలో మరో 400 పంపిణీ చేయనున్నారని ఆయన వెల్లడించారు. 2015లో అందించిన యంత్రాల కంటే ఆధునాతనమైనవని, రైతుసేవలో వాటిని వినియోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు తోటకూర శ్రీనివాసరావు, జయదేవ్‌రాజన్ (ఎరువులు), ఏపీ రాష్ట్ర ఎరువుల డీలర్ల సంఘం అధ్యక్షుడు వి.నాగిరెడ్డి, పీపీఎల్ ప్రతినిధులు పీవీ సుభాష్, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య

చినగంజాం: తండ్రి మందలించాడన్న కోపంతో మనస్తాపం చెంది ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సంతరావూరులో మూడు రోజుల కిందట జరగగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శీలం రమేష్ వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బారెపు నోవాహు కుమారుడు బారెపు బాలు (22) ఐటీఐ పూర్తి చేసి ఫైబర్ నెట్‌లో పనిచేశాడు. ఎనిమిది నెలల కిందట ఉద్యోగం మానేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో మూడు రోజుల కిందట బాలు బెంగళూరుకు వెళ్తాను డబ్బులు ఇవ్వమని తండ్రిని అడిగాడు. దీంతో తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన బాలు వారు నివాసం ఉండే సమీపంలో పొగాకు బ్యారన్ పక్కన ఉన్న పశువుల కొష్టంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలు బెంగళూరుకు వెళ్లి ఉంటాడేమోనని తండ్రి భావించాడు. ఈక్రమంలో చుట్టుపక్కల వారు కొష్టం నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చూడగా బాలు మృతదేహం కన్పించింది. బాలు అవివాహితుడు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ విజేత వైజాగ్



విజేతగా నిలిచిన విశాఖపట్టణం ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు



ద్వితీయ స్థానంలో నిలిచిన హుబ్లీ జట్టు క్రీడాకారులు

- ముగిసిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు
- ద్వితీయ స్థానంలో హుబ్లీ జట్టు
- విజేతలకు నగదు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల రూరల్: యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచి సన్మార్గంలో నడవాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కావూరి పవన్‌కుమార్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అనేక నగరాలు పట్టణాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు ఎంతో శ్రమకోర్చి జాతీయస్థాయి పోటీలను తలపించే విధంగా యూ ట్యూబ్‌లో లైవ్ ఏర్పాటు చేశారు. పోటీలో అన్ని విభాగాల్లో రాణించి విశాఖపట్టణం శ్రీధర్ ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు విజేతగా నిలిచారు. రూ.50 వేల నగదు బహుమతితో పాటు భారీ కప్‌ను ఎమ్మెల్యే చేతులు మీదుగా క్రీడాకారులు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో హుబ్లీ జట్టు నిలిచి రూ.30 వేల నగదు బహుమతి అందుకున్నారు. తృతీయ స్థానంలో విజయవాడ జట్టు నిలిచి రూ.20 వేల నగదు బహుమతి అందుకున్నారు.

ఉత్కంఠగా ఫైనల్ పోరు

ఫైనల్‌లో విశాఖపట్టణం, హుబ్లీ జట్టు తలపడ్డాయి. మొదటి ఫస్ట్ హాఫ్‌లో విశాఖ జట్టు రెండు గోల్స్ చేసింది. అనంతరం సెకండాఫ్‌లో హుబ్లీ జట్టు పుంజుకొని రెండు గోల్స్ సాధించింది. దీంతో నిర్ణీత సమయానికి ఇరుజట్లు క్రీడాకారులు పోటాపోటీగా చిరుతపులుల్లా తలపడి ఆటను సమంగా ముగించాయి. అనంతరం అంపైర్లు ఇరుజట్లకు పెనాల్టీ షూట్ అవుట్ ఇచ్చారు. ఇక్కడ కూడా ఇరు జట్లు సమంగా నిలిచాయి. అనంతరం మరోసారి అవకాశం ఇవ్వగా వైజాగ్ జట్టు అధిక గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. పోటీలలో బెస్ట్‌గోల్ కీపర్‌తో పాటు అనేక అంశాలలో సత్తాచాటిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు నూతలపాటి విజయకుమార్ (దాసు) నూతలపాటి నరేష్, బొనిగల ప్రేమయ్య, నాలుగు జిల్లాల కోఆర్డినేటర్ దేవదాసు, పంబా నాగయ్య, మున్సిపల్ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం, క్రీడాకారులు, అంపైర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మనాన్నల కల్యాణం

బాపట్లటౌన్: మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న జగన్మాత మాతృశ్రీ అనసూయ మహాదేవి, బ్రహ్మాండం నాగేశ్వరరావుల కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. విశ్వజననీ పరిషత్ కోశాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ అనసూయాదేవి అందరి అమ్మగా, జిల్లెళ్లమూడి అమ్మగా లోక ప్రసిద్ధి చెందారన్నారు. జిల్లెళ్లమూడి గ్రామానికి ఏ వేళప్పుడు ఎవరొచ్చినా వారికి తృప్తిగా భోజనం పెట్టి వారికి కడుపునింపడం, ఆకలితో జిల్లెళ్లమూడి రావచ్చు కానీ, జిల్లెళ్లమూడి నుంచి ఆకలితో వెళ్లరాదనేది అమ్మ ఆశయమన్నారు. జిల్లెళ్లమూడి అమ్మ తొలినాళ్లల్లో వారి పతిదేవుల సంపాదనతోనే తమ దర్శనార్థం వస్తున్న వారందరికీ స్వయంగా అన్నం వండి, వడ్డించడం చేసేవారన్నారు. అనతి కాలంలో అమ్మ బిడ్డలందరి సమష్టి కృషితో జిల్లెళ్లమూడిలో అన్నపూర్ణాలయం ఏర్పడిందన్నారు. సంవత్సరమంతా నిత్యకల్యాణం, పచ్చతోరణం మాదిరి ఉంటుందన్నారు. అమ్మవారి కల్యాణమహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మనాన్నలకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. కల్యాణం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మామని చంపిన అల్లుడికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో మామను చంపిన అల్లుడిపై కొత్తపేట పోలీసులు 2017లో ఐపీఎస్ 302 కేసును రిజిస్టర్ చేశారు. రెండవ అదనపు జిల్లా సెషన్ కోర్టులో కేసు విచారణకు సోమవారం వచ్చింది. వాద, ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి వై. నాగరాజా, నిందితుడు కుర్ర శివ నాగభూషణానికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పును వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ. అలీఖాన్ వాదనలు వినిపించారు.